సాక్షి
వనపర్తి
సోమవారం, 9, జనవరి, 2023



కష్టాల వంతెన

దుందుభీపై వంతెన నిర్మించాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా.. అవి బుట్టదాఖలవుతున్నాయి.

వివరాలు 8లో ▸



కార్గో.. కాసుల పంట

ఆర్టీసీ ప్రారంభించిన కార్గో సేవలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /14.0

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. రాత్రివేళ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జనవరి 26 నుంచి పాదయాత్ర

- ఈ నెల 12లోపు గ్రామ, మండల కార్యవర్గాలు.. 20లోపు జిల్లా కార్యవర్గం తుదిరూపు
- మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి



వనపర్తి టౌన్: దేశాన్ని ఏకం చేసేందుకు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర సందేశాన్ని నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి చేరవేసేందుకు జనవరి 26 నుంచి మార్చి 26 వరకు పాదయాత్ర చేపట్టనున్నామని.. కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని మాజీ మంత్రి, పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ డా. చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో హాత్ సే హాత్ అభియాన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గాన్ని వనపర్తి, పెద్దమందడి బ్లాక్‌లుగా విభజించామని.. ఒక నెలలో 70 గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర చేసేలా టీపీసీసీ ఆదేశాలు ఇచ్చిందన్నారు. మధ్యలో అవకాశాన్ని బట్టి ఒకసారి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొంటారని చెప్పారు. పాదయాత్ర సన్నద్ధతలో భాగంగా ఈ నెల 12 వరకు అన్ని గ్రామ, మండల, పట్టణ, బ్లాక్ కమిటీలు, 20వ తేదీలోపు జిల్లా కమిటీకి తుదిరూపు ఇస్తామన్నారు. కమిటీల్లో అన్నివర్గాలకు ప్రాధాన్యం ఉండేలా దృష్టి సారించామని తెలిపారు. పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మత్స్యకార జిల్లా అధ్యక్షుడు యాదయ్య, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, త్రినాథ్, చీర్ల విజయ్‌చందర్, దివాకర్ యాదవ్, మధుగౌడ్, బాబా, వెంకటేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ పాదయాత్ర

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, గోపులాపూర్, సింగవరం, కొండూరులో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ప్రగతి కోసం పాదయాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కొల్లాపూర్‌లో కూడా బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. భరత్‌చంద్ర, ప్రసాద్, వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

● పర్యాటకం..

బహుదూరం

జూరాల ప్రాజెక్టు వద్ద నిలువ నీడ కరువు



జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ వద్ద పర్యాటకులు (ఫైల్)

- శిథిలావస్థకు చంద్రగఢ్ కోట
- సందర్శకులకు తప్పని తిప్పలు

అమరచింత: ఉమ్మడి జిల్లాకే తలమానికమైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఏళ్లుగా పర్యాటకంగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కృష్ణా పుష్కరాల సమయంలో ఘాట్లు నిర్మించినా.. నాణ్యత లేకపోవడంతో వరద ప్రవాహానికి కొట్టుకుపోయి బండరాళ్లు తేలాయి. ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన పర్యాటకులు కాసేపు సేద తీరడానికి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు రహదారిలో అమరచింత మండలంలో ఉన్న చారిత్రక కట్టడమైన చంద్రగఢ్ కోట అభివృద్ధిని సైతం పాలకులు విస్మరిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పచ్చదనంతో కుడి కాల్వ విభాగం..


జూరాల ప్రాజెక్టు కుడికాల్వ పరిసరాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో కుడి కాల్వ ఉండటం, ప్రాజెక్టు ప్రధాన కార్యాలయాలు సైతం అక్కడే ఉండటంతో ఆ ప్రాంతంలో పార్క్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చొరవతో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

ఎడారిలా ఎడమ కాల్వ విభాగం..

ఎడమ కాల్వవైపు విశాలమైన ప్రదేశం, చేప వంటకాల విక్రయ దుకాణాలు ఉండటంతో డ్యాం సందర్శనకు పర్యాటకులు అధికంగా ఇటువైపు వస్తుంటారు. కనీసం వసతులు, చెట్ల నీడ కూడా లేక ఎడారిని తలపిస్తుండటంతో పర్యాటకులు పిల్లాపాపలతో కాసేపు సరదాగా ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థలో చంద్రగఢ్ కోట..

గుప్తుల కాలంలో చంద్రగుప్తుడు కృష్ణానది సమీపంలో తన భార్య చంద్రమతి పేరుతో చంద్రగఢ్ కోటను నిర్మించారు. శత్రువులను దూరం నుంచి పసిగట్టి మట్టుబెట్టేందుకు కోట పైభాగంలో ఫిరంగులను ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మికత కోసం శివాలయం, రాతి కోనేరు ఉన్నాయి. మండుటెండలో సైతం కోనేరులో నీరు ఉండటం విశేషం. ప్రస్తుతం నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోట గోడలు, నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.



చంద్రగఢ్ కోట

వసతులు కల్పించాలి..

జూరాల ప్రాజెక్టు వద్ద వసతులు లేకపోవడంతో సందర్శనకు వచ్చే పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సేద తీరేందుకు పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రాజు, మస్తీపురం

అభివృద్ధి చేయాలి..



చారిత్రక చంద్రగఢ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ప్రస్తుతం గ్రామపంచాయతీ నిధులు, అధికారుల చొరవతో కోట పరిసరాల్లో మెగా పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు ప్రత్యేక చొరవచూపి పురాతన కట్టడాలను సంరక్షించాలి.

– నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్, చంద్రగఢ్

ప్రతిపాదనలు పంపాం..



జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ విభాగంలో పచ్చదనాన్ని పెంపొందించి పార్క్‌లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు గతంలోనే నివేదికలు పంపాం. పర్యాటకులకు సౌకర్యాలు కల్పించేలా మరోమారు ప్రతిపాదనలు పంపుతున్నాం.

– జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ డ్యామ్ డివిజన్

రాష్ట్ర యువజనోత్సవాలకు డిగ్రీ కళాశాల విద్యార్థులు

వనపర్తిటౌన్: హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఈ నెల 9 నుంచి జరిగే యువజనోత్సవాలకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేశ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3న జిల్లా యువజనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద బృందగానం, బృంద నాట్యంలో మొదటి స్థానంలో నిలిచినందుకు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని, కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు వెళ్తున్నారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్, అధ్యాపకుడు శివుడు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

మాతృభూమి సేవలో..



ఉచిత అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఉద్యోగాల కోసమో.. వ్యాపారాల నిమిత్తమో దేశం కాని దేశం వెళ్లారు. మెరుగైన ఉపాధి దొరకడంతో అక్కడే స్థిరపడ్డారు. విదేశాల్లో ఉంటున్నా.. పుట్టి పెరిగిన ఊరిపై మమకారంతో గ్రామానికి.. తాను చదివిన పాఠశాలకు తోచిన సాయం చేస్తూ మాతృభూమి సేవలో తరిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎంతో మంది వివిధ దేశాల్లో స్థిరపడగా.. వారిలో కొందరు తాము ప్రత్యేకమంటూ తమ ఊరు, ఆ ప్రాంత అభివృద్ధిలో మేముసైతం అంటూ ముందుకు వస్తున్నారు. సోమవారం ప్రవాసీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– కల్వకుర్తి రూరల్/ కొల్లాపూర్/ అచ్చంపేట రూరల్/ చిన్నంబావి

- విదేశాల్లో స్థిరపడినా స్వదేశంపై వీడని మమకారం
- పుట్టిన ఊరు, ప్రాంత అభివృద్ధికి విశేష కృషి
- ఆలయాలు, రహదారుల నిర్మాణానికి.. విద్యాభివృద్ధికి సహకారం
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ప్రవాస భారతీయులు

సుంకిరెడ్డి.. సేవలు అదుర్స్

కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వెల్దండ మండలం, చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డారు. అక్కడ వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎంతో సంపాదించిన ఆయన.. జన్మనిచ్చిన ప్రాంతంలోని ప్రజలకు తనకు తోచిన విధంగా చేయూత అందించాలనే సంకల్పంతో 6 నెలల క్రితం కల్వకుర్తి ప్రాంతానికి చేరుకున్నారు. ఇప్పటి వరకు రూ.5 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి వివిధ రకాల సేవలు అందించారు. ఐక్యత ఫౌండేషన్ ఏర్పాటు చేసి విద్య, వైద్యం, ఉపాధి రంగాలను ప్రధాన అంశంగా చేసుకొని.. నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్నారు. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో పోటీ పరీక్షలకు వారిని సిద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభించారు. అలాగే స్వగ్రామం చౌదర్‌పల్లిలో రూ.20 లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. పేద ప్రజలకు ఉచితంగా సేవలు అందించేందుకు కల్వకుర్తి, ఆమనగల్ ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద 6 చొప్పున ఉచిత అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్నవారి కుటుంబాలను వీటి ద్వారా ఆదుకుంటున్నారు. అలాగే ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక స్థోమత లేనివారికి సహకరిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యం కలిగి శిథిలావస్థకు చేరుకున్న ఆలయాల పునరుద్ధరణకు అవసరాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా అందిస్తున్నారు. యువజన సంఘాలతోపాటు క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. సామాజిక సేవే లక్ష్యంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముందడుగు వేస్తున్నారు.

తాండ్రలో వందమందికిపైగా..

కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో వందమందికిపైగా అమెరికా, కెనడా, బ్రిటన్ వంటి దేశాల్లో స్థిరపడ్డారు. గ్రామానికి చెందిన ఓ ప్రవాసుడు గ్రామంలోని ఆలయ నిర్మాణానికి, గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డుపై కమాన్ నిర్మించారు. విదేశాల్లో స్థిరపడిన చాలామంది వ్యక్తులు తమకు తోచిన విధంగా చిన్న చిన్న కార్యక్రమాలకు ఆర్థికంగా సహకారం అందిస్తున్నారు. కరోనా సమయంలో ఉచిత మందుల పంపిణీకి మరికొందరు ముందుకొచ్చారు.

సేవే పరమావధిగా..

చిన్నంబావి: మండలంలోని వెల్టూరుకు చెందిన కొత్త కల్యాణ్‌రావు కెన్యాలో 22 ఏళ్ల పాటు ఉండి కరోనా సమయంలో స్వదేశానికి వచ్చారు. గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు తండ్రి కొత్త మాధవరావు పేరున కేఎంఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవ చేయాలని నిర్ణయించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,536 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ ముందుకు సాగుతున్నారు. స్వగ్రామం వెల్టూరులోని ఉన్నత పాఠశాలలో సొంత ఖర్చులతో నలుగురు వాలంటీర్లను నియమించారు. అదే విధంగా గ్రామంలో శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. మండలంలోని ఇద్దరు దివ్యాంగులకు త్రీ వీలర్ వాహనాలు అందజేశారు. గ్రామంలోని జమ్ములమ్మ ఆలయ నిర్మాణానికి, మండలంలోని 7 గ్రామాల్లో ఉన్న పురాతన ఆలయాల పునరుద్ధరణకు ఆర్థిక సాయం చేశారు. 2023లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తాను చదువుకొనే రోజుల్లో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని.. ప్రస్తుత విద్యార్థులకు డిజిటల్, కంప్యూటర్ విద్య అందించడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో వెల్టూరులో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానని వివరించారు. విద్యాభివృద్ధే లక్ష్యంగా కేఎంఆర్ ట్రస్ట్ ముందుకెళ్తుందన్నారు.



దివ్యాంగులకు త్రీవీలర్ స్కూటీలు అందిస్తున్న కొత్త కల్యాణ్‌రావు

రైతు కుటుంబాలకు అండగా..



ఉప్పునుంతల: ఉప్పరిపల్లికి చెందిన బొజ్జ అమరేందర్‌రెడ్డి 20 ఏళ్ల క్రితం అమెరికాలో స్థిరపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వీరాభిమాని అయిన అతను ప్రస్తుతం ఏపీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లావ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న రైతులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. అచ్చంపేట–నాగర్‌కర్నూల్ రహదారి సమీపంలో ఉప్పరిపల్లి స్టేజీ వద్ద తన తండ్రి బొజ్జ మోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం బస్‌షెల్టర్ నిర్మించడంతోపాటు దాహార్తి తీర్చడానికి బోరు వేయించారు. ఉప్పరిపల్లి, వటువర్లపల్లి తదితర గ్రామాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలు అందజేశారు. ప్రస్తుతం అమెరికాలోనే ఉంటూ అచ్చంపేట నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఆర్థికసాయాలు అందించినప్పుడు వారి దీవెనలు ఎంతో సంతోషానిచ్చాయని, ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి చేయూత



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన చిట్టెం అచ్యుత్‌రెడ్డి పదేళ్ల క్రితం లండన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. తాను పుట్టిన గ్రామానికి ఏదైనా సేవ చేయాలన్న తపనతో గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం రూ.లక్ష ఖర్చుతో డిజిటల్ క్లాస్ రూములను ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో రెండు ఆలయాల నిర్మాణం కోసం రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ క్రమంలో ఆయన తండ్రి దామోదర్ రెడ్డి సర్పంచ్‌గా గెలవగా.. వివిధ రకాల అభివృద్ధి పనులకు తోడ్పాటునందించారు. ప్రస్తుతం గ్రామంలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నారు.

అభివృద్ధి పరుగులు

- పీయూలో రూపుదిద్దుకుంటున్న కొత్త నిర్మాణాలు
- ఖేలో ఇండియా స్కీం నిధులతో కొత్త గ్రౌండ్‌లో సింథటిక్ ట్రాక్
- తాగునీటి ఎద్దడి నివారణకు రూ.3 కోట్లతో వాటర్ ట్యాంక్
- నూతన బాలికల హాస్టల్, క్యాంటీన్, షటిల్, బాస్కెట్ బాల్ కోర్టుల ఏర్పాటు
- గద్వాల పీజీ సెంటర్‌లో రూ.10 కోట్లతో తరగతి గదుల కాంప్లెక్స్ నిర్మాణం



పీయూలో బాలికల హాస్టల్ నిర్మాణం కోసం జరుగుతున్న పనులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. విద్యార్థులకు మౌళిక వసతుల కల్పన కోసం దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభమవగా.. మరికొన్ని పనులు మొదలుపెట్టాల్సి ఉంది. పీయూ ప్రారంభం నుంచి పూర్తిస్థాయిలో ప్రత్యేక గ్రౌండ్ లేదు. దీని ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. అలాగే ఇక్కడ ప్రత్యేకంగా సింథెటిక్ ట్రాక్ సైతం నిర్మించేందుకు చకచకా పనులు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని సింథెటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా పీయూ పట్టణానికి కాస్త దూరంగా ఉండటంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థులు చిన్న చిన్న అవసరాల కోసం బండమీదిపల్లికి వెళ్లాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు పీయూలో అన్ని సదుపాయాలతో కూడిన క్యాంటిన్ సైతం త్వరలోనే నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.70 లక్షలు కేటాయించనున్నారు. ముఖ్యంగా సెంట్రల్ రీసెర్చ్ భవనం నిర్మించేందుకు పలు నమూనాలను అధికారులు ఇటీవల పరిశీలించారు. త్వరలోనే ఇందుకు సంబంధించి భూమిని సేకరించి రూ.10 కోట్లతో నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

ఖేలో ఇండియాలో..

పీయూలోని ఫార్మసీ కళాశాల వెనక భాగంలో గ్రౌండ్ ఏర్పాటు కోసం 2 ఎకరాలకు పైగా భూమిని చదును చేశారు. దీనిని ఖేలో ఇండియా కేంద్ర బృందం సైతం పరిశీలించింది. అక్కడి నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు వస్తే ఇక్కడ జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో సింథెటిక్ ట్రాక్ నిర్మాణం రూపుదిద్దుకోనుంది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సింథెటిక్ ట్రాక్ ఎక్కడా లేకపోవడం విశేషం. దీనిని ఇక్కడ ఏర్పాటు చేస్తే జాతీయ స్థాయి పోటీలు సైతం నిర్వహించేందుకు, పోటీలకు సిద్ధమయ్యే వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతోపాటు బాస్కెట్ బాల్, షెటిల్ కోర్టులను సైతం రూ.21 లక్షలతో నిర్మించనున్నారు.

పెరుగుతున్న విద్యార్థులు..

పీయూ ప్రారంభం నుంచే బాలురకు రెండు హాస్టల్ భవనాలు ఉన్నాయి. దీంతో వారు ఉండేందుకు పెద్దగా సమస్యలు రావడం లేదు. కానీ రెండు, మూడేళ్ల నుంచి పీయూలో చేరే బాలికల సంఖ్య పెరుగుతుండటంతో వారికి ఉన్న ఒక హాస్టల్ సరిపోవడం లేదు. దీంతో బాలికల హాస్టల్ వెనక ఉన్న కేజీబీవీలో తాత్కాలికంగా హాస్టల్ ఏర్పాటు చేశారు. అయితే వీరికి శాశ్వత హాస్టల్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు వెచ్చించారు. ఈ పనులు పునాది వరకు పూర్తయ్యాయి. మొత్తంగా పీయూ హాస్టల్‌లో 700 మంది వరకు బాలికలు ఉంటున్నారు. వీటితోపాటు మూడు హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు బోర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ, వర్షాకాలం తర్వాత చాలా సందర్భాల్లో నీటి ఎద్దడి ఏర్పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేకంగా రూ.3.2 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. దీనికి త్వరలోనే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. గద్వాల పీజీ సెంటర్‌లో తరగతి గదుల కోసం రూ.10 కోట్లతో ఓ కాంప్లెక్సు నిర్మాణం చేపట్టారు.

నిర్మాణాలు.. ఖర్చు చేయనున్న నిధులు ఇలా..

కళాశాల	భవనం	నిధులు (రూ.కోట్లలో..)
పీయూ క్యాంపస్	సెంట్రల్ రీసెర్చ్ బిల్డింగ్	10
పీయూ క్యాంపస్	వాటర్ ట్యాంక్	3.2
గద్వాల పీజీ సెంటర్	క్లాస్ రూం కాంప్లెక్స్	10
పీయూ క్యాంపస్	సింథెటిక్ ట్రాక్	8
పీయూ క్యాంపస్	బాలికల హాస్టల్ భవనం	10
పీయూ క్యాంపస్	క్యాంటీన్ భవనం	0.70
పీయూ క్యాంపస్	బాస్కెట్‌బాల్, షటిల్ కోర్టులు	0.21

పూర్తిస్థాయిలో వసతులు..

యూనివర్సిటీలో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తాం. వసతులు ఉంటే కొన్ని కేంద్ర సంస్థల ద్వారా నిధులు వస్తాయి. ముఖ్యంగా ప్రత్యేక గ్రౌండ్, సింథెటిక్ ట్రాక్ నిర్మించేందుకు ఖేలో ఇండియా స్కీం ద్వారా ప్రయత్నిస్తున్నాం. ఇటీవల ఓ బృందం గ్రౌండ్‌ను పరిశీలించింది. అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి అన్ని రకాల వసతులు కల్పిస్తాం.

– లక్ష్మీకాంత్ రాథోడ్, వీసీ, పాలమూరు యూనివర్సిటీ

వేగంగా నిర్మాణాలు



పీయూను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీసీ స్పోర్ట్స్ పరంగా పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీ భవనం నిర్మాణం జరగనుంది. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో ప్రయోగాలు బాగా పెరిగే అవకాశం ఉంది. పీయూ ప్రారంభం నుంచి ఉన్న బాలికల హాస్టల్ భవనం సమస్యను పరిష్కరిస్తున్నాం.

– గిరిజ, రిజిస్ట్రార్, పాలమూరు యూనివర్సిటీ

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బల్మూర్: అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని పోలిశెట్టిపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట పట్టణానికి చెందిన వనం విజయ్(45) ఎలక్ట్రానిక్ దుకాణం నడిపిస్తున్నాడు. ఇటీవల కాలంలో అప్పులు చేయడంతో తరుచూ అప్పులు ఇచ్చిన వారు వేధించేవారు. అప్పుల బాధ తాళలేక శనివారం సాయంత్రం పోలిశెట్టిపల్లి శివారులో పురుగు మందు తాగి మృతి చెందాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యం మత్తులో పురుగు మందు తాగి..


బాలరాజు (ఫైల్)

అడ్డాకుల: మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మూసాపేట ఎస్ఐ నరేష్ తెలిపారు. మూసాపేట మండలంలోని మహ్మద్‌హుస్సేన్‌పల్లికి చెందిన ముష్టి బాలరాజు(43), అరుణ దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన గ్రామంలోనే వ్యవసాయం చేస్తుండగా భార్య అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. కొన్నాళ్ల నుంచి మద్యానికి బానిసైన బాలరాజును మద్యం మానాలని భార్య చెప్పినా వినిపించుకోలేదు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. తండ్రి వద్ద పురుగుల మందు వాసన రావడాన్ని గుర్తించిన కుమారుడు విషయాన్ని తల్లికి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు రాత్రి మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చెరువులోపడి వ్యక్తి మృతి

ధరూరు (కేటీదొడ్డి): చెరువులోపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కేటీదొడ్డి మండలంలోని చింతలకుంటలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన పాగుంటప్ప(50) గ్రామ సమీపంలో ఉన్న చెరువులో ఆదివారం శవమై కనిపించాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

చికిత్స పొందుతూ..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ గోకారి కథనం మేరకు వివరాలు ఇలా.. మల్దకల్ మండలం పెద్దపల్లి చెందిన ఉప్పరి వెంకట్రాముడు (45) శుక్రవారం ఎర్రవల్లికి వచ్చాడు. శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్లే రోడ్డులో జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు ఉప్పరి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సాతర్ల గ్రామంలో..

ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామానికి చెందిన బోయ హనుమంతు (47) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్తాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించగా ఆదివారం మృతి చెందాడు. మృతుని సోదరుడు బోయ తిమ్మప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మక్తల్ మండలం మాద్వార్‌లో..

మక్తల్: మండలంలోని మాద్వార్ చెందిన ఆనంద్(25) తన ఇంట్లో ఈ నెల 1వ తేదీన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఆయనను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

కోయిల్‌కొండ మండలం లింగల్‌చేడ్‌లో..

కోయిల్‌కొండ: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం లింగల్‌చేడ్‌తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన కడావత్ వెంకటేష్ నాయక్ (32) గత నెల 21వ తేదీన భూమి విషయంపై బంధువైన వెంకటేష్ తరుచుగా వేధించడంతో శనివారం పురుగు మందు తాగాడు. ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనయ్య తెలిపారు.

వాహనం బోల్తా : నలుగురికి గాయాలు

కోయిల్‌కొండ: ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడి నలుగురికి గాయాలైన సంఘటన ఆదివారం వాల్యానాయక్‌తండా వద్ద చోటు చేసుకుంది. వరినాట్లు వేసేందుకు కూలీలు బొలెరో వాహనంలో మండలంలోని శేరివెంకటాపూర్ నుంచి ధన్వాడ మండలం పూసల్‌పహాడ్‌కు వెళ్తున్నారు. వ్యాల్యానాయక్‌తండా వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం, జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తొలగని పీఎఫ్ అడ్డంకులు

ఇబ్బందులు పడుతున్న జడ్చర్ల పుర కార్మికులు

- భవిష్యనిధికి చేరినా ఖాతాల్లో జమకాని రూ.కోటి బకాయిలు
- 2012 నుంచి నేటి వరకు 15 మంది కార్మికుల మృత్యువాత
- ఆయా కుటుంబాలకు అందని ప్రయోజనాలు


పీఎఫ్, ఈఎస్ఐ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

జడ్చర్ల టౌన్: పుర కార్మికులను పీఎఫ్ సమస్య వెంటాడుతోంది. 2012–13, 2013–14కు సంబంధించి కార్మికుల వేతనాల నుంచి డబ్బులు కట్ చేసినప్పటికీ వారి పీఎఫ్ ఖాతాల్లో జమకాకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక పోరాటాల తర్వాత రూ.కోటి బకాయిలు 2019లో భవిష్యనిధిలో జమచేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. 2012 నుంచి నేటి వరకు పుర పరిధిలో వివిధ కారణాలతో 15 మంది కార్మికులు మృతిచెందారు. ఆయా కుటుంబాలకు పీఎఫ్ ద్వారా ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదు. 2019లో అప్పటి కమిషనర్ సునీత హయాంలో పీఎఫ్‌కు సంబంధించిన ఫైల్ తుదిదశకు తీసుకొచ్చి కార్మికుల వేతనాల నుంచి కట్ చేసిన డబ్బులు పీఎఫ్ నిధికి జమచేశారు. అయినప్పటికీ నేటికీ కార్మికుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

■ 2012, డిసెంబర్‌లో బాదేపల్లి, జడ్చర్ల మేజర్ గ్రామపంచాయతీలను మున్సిపాలిటీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు జడ్చర్ల పంచాయతీవాసులు అభ్యంతరం చెప్పటంతో 2014లో మున్సిపాలిటీ రద్దుచేస్తూ రెండింటిని గ్రామపంచాయతీలుగా కొనసాగించారు. అనంతరం అదే సంవత్సరం బాదేపల్లిని నగరపంచాయతీగా మారుస్తూ డీనోటిఫికేషన్ జారీ అయింది. ఈ క్రమంలో 2012 నుంచి 2014 వరకు కార్మికుల వేతనాల నుంచి ప్రతినెలా పీఎఫ్ కోసం 12 శాతం, ఈఎస్ఐ కోసం 1.75 శాతం డబ్బులు కట్‌చేశారు. కార్మికుల నుంచి కట్‌చేసిన డబ్బులు మున్సిపాలిటీకీ పీఎఫ్ నంబరు రాకపోవటంతో జమచేయకుండా అలాగే ఉంచారు. తమ వేతనాల నుంచి తీసుకున్న డబ్బులు పీఎఫ్ నిధికి జమచేయలేదంటూ కార్మికులు పోరాటాలు ప్రారంభించడంతో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బాలకృష్ణనాయక్‌ను విచారణ నిమిత్తం నియమించారు. ఆయన విచారణ చేపట్టి కార్మికుల నుంచి కట్ చేసిన పీఎఫ్ డబ్బులు దుర్వినియోగమయ్యాయని అప్పటి కమిషనర్ రవీందర్‌రావుపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాస్తవానికి ఆ డబ్బులు విజేత పట్టణ మహిళా సమాఖ్య ఖాతాలో భద్రంగా ఉన్నాయని ఆ తరువాత తేల్చారు. అయితే అప్పటికే మున్సిపాలిటీకి పీఎఫ్ ఖాతానంబర్లు రావటంతో 2015లో కమిషనర్ వెంకటరమణారావు కార్మికుల వేతనాల నుంచి డబ్బులు కట్‌చేసి వారి వ్యక్తిగత పీఎఫ్ ఖాతాల్లో జమచేస్తూ వచ్చారు. ఆయన బదిలీ అనంతరం కమిషనర్‌గా వచ్చిన గంగారాం సైతం పాత బకాయిల విషయంలో పురోగతి సాధించేందుకు యత్నించినప్పటికీ సాధ్యపడలేదు. ఆయన తరువాత కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సునీత 2019లో సమస్యను ఓ కొలిక్కి తీసుకురాగలిగారు. దుర్వినియోగమైనట్లుగా చెప్పిన పాత బకాయిలతో పాటు ప్రభుత్వ వాటా కలిపి మొత్తం సుమారు రూ.90 లక్షలు పీఎఫ్ నిధికి కావడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. కానీ నేటికీ కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో మాత్రం ఆ డబ్బులు జమ కాలేదు. దీంతో కార్మికులకు ఇబ్బందులు తప్పటం లేదు.


జడ్చర్ల పుర కార్యాలయం

15 మంది కార్మికులు మృతి..

2012 నుంచి నేటి వరకు పుర పరిధిలో దాదాపు 15 మంది కార్మికులు వివిధ కారణాలతో మృతిచెందారు. కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో పీఎఫ్ నిధులు జమకాకపోవటంతో వారి కుటుంబాలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. అయితే కార్మికుల కుటుంబాల్లో ఒకరిని విధుల్లోకి తీసుకోవటంతో కొంత మేలు చేకూరినట్లయింది.

చాలా నష్టపోయాం..



పీఎఫ్, ఈఎస్ఐ కోసం పుర పరిధిలోని 200 మంది కార్మికుల వేతనాల నుంచి 2012–14 మధ్యకాలంలో కట్ చేసిన డబ్బుల కోసం అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. వ్యక్తిగత ఖాతాల్లో జమచేయకపోవటంతో చాలా నష్టపోయాం. 15 మంది కార్మికులు చనిపోతే ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.
– వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్

లేఖ రాశాం



కార్మికుల 2012–14కు సంబంధించి పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమకానిది వాస్తవమే. 2019లో బకాయిలన్నీ పీఎఫ్ నిధికి జమచేశారు. కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో జమచేయాలని పీఎఫ్ కార్యాలయానికి లేఖ రాశాం. అక్కడి నుంచి సమాధానం వచ్చిన తరువాత ఏంచేయాలో నిర్ణయం తీసుకొని కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తాం.
– మహమూద్‌షేక్, కమిషనర్, జడ్చర్ల

వీలైనంత త్వరగా పరిష్కారం..

పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు వ్యక్తిగత ఖాతాల్లో జమచేయలేదని కార్మికులు మా దృష్టికి తీసుకొచ్చారు. దీంతో బకాయిలు జమచేయాలని పీఎఫ్ కార్యాలయానికి లేఖలు రాశాం. సమస్యను ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఎలా చేయాలో చర్చించి చర్యలు తీసుకుంటాం. కార్మికులకు తగిన న్యాయం జరిగేలా చూస్తాం.
– దోరేపల్లి లక్ష్మి, చైర్‌పర్సన్, జడ్చర్ల మున్సిపాలిటీ

కష్టాల వంతెన

- దుందుబీ వాగుపై వంతెనకు కలగని మోక్షం
- రెండు నియోజకవర్గాల మధ్య నిలుస్తున్న రాకపోకలు

అచ్చంపేట: దుందుబీ వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగులుతుంది. మొల్గర–ఉల్పర మధ్య శాశ్వత వంతెన నిర్మాణం చేయాలని అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల ప్రజల విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి. మొల్గర దుందుబీ వాగుపై ఉన్న లోలేవల్ కల్వర్టు మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతు చేస్తున్నారే తప్ప శాశ్వత వంతెన ఏర్పాటు చేయలేకపోతున్నారు. ఏటా వర్షాకాలంలో దుందుబీ వాగుపై నాలుగు నెలల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు రెండేళ్ల క్రితమే ఆర్అండ్‌బీ అధికారులు రూ.30కోట్ల అంచనా వేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఏళ్లు గడుస్తున్న ప్రభుత్వం నుంచి అనుమతి రావడం లేదు.

తాత్కాలిక మరమ్మతులు..

పదేళ్లుగా వర్షాకాలంలో మొల్గర దుందుబీవాగుపై వంతెన తెగిపోతుంది. చిన్న వరద వచ్చిన ఈరోడ్డుపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అచ్చంపేట, ఉప్పునుంతల, వంగూరు, తెలకపల్లి, కల్వకుర్తి మండలాల మధ్య బంధాలు తెగిపోతున్నాయి. వరదలతో పాటు కేఎల్ఐ కాల్వలు తెగినా ఈ వాగులోకి నీరు చేరి రాకపోకలు నిలచిపోతాయి. వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిషేధిస్తూ పోలీస్ పహారా కాస్తున్నారు. మట్టిపోసి పైపులు వేసి రోడ్డును పునరుద్దరించగా.. వర్షాకాలంలో వరదకు మళ్లీ రోడ్డు తెగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇందుకోసం రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఈసారి కూడా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వరదలకు లో లెవల్ కల్వర్టు తెగిపోయిన ప్రతిసారి రూ.లక్షల్లో నిధులు నీటి పాలు అవుతున్నాయని స్థానికులు అంటున్నారు.

బ్రిడ్జితోపాటు డబుల్ రోడ్డు వేస్తే..

అచ్చంపేట–ఉప్పునుంతల, మొల్గర మీదుగా కల్వకుర్తి వెళితే అచ్చంపేట వాసులకు 20 కి.మీ. దూరం తగ్గుతుంది. ఇలాంటి రోడ్డు మార్గంలో ఉన్న లో లెవల్ కల్వర్టు స్థానంలో హై లెవల్ వంతెన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా అచ్చంపేట– ఉప్పునుంతల మధ్య డబుల్ రోడ్డు ఉంది. అక్కడి నుంచి మొల్గర, రంగాపూర్, కల్వకుర్తి వరకు 30కి.మీ. డబుల్ రోడ్డు వేయడం వల్ల ప్రయాణికులకు మరింత సమయం కల్సిస్తుంది.


మొల్గర–ఉల్పర మధ్య దుందుబీ వాగుపై చేపట్టిన తాత్కాలిక మరమ్మతులు

శాశ్వత పరిష్కారం చూపాలి



మొల్గర–ఉల్పర మధ్య దుందుబీ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, శాశ్వత పరిష్కారం చూపాలి. లోలెవల్ కల్వర్టు తెగిపోవడంతో నాలుగు నెలల పాటు ఇబ్బందులు పడుతున్నాం. అనేక సార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.
– శ్రీనివాస్‌గౌడు, మొల్గర, ఉప్పునుంతల మండలం

దశాబ్దాలుగా ఇదే పరిస్థితి



పదేళ్లుగా వర్షాలకు దుందుబీవాగు పొంగి లోలెవల్ కల్వర్టు, పైపులు కొట్టుకుపోతున్నాయి. అధికారులు నిధులు మంజూరు చేయించి తాత్కాలిక మరమ్మతులతో చేతులు దులుపుకుంటున్నారు. ఏడాదిలోపే మళ్లీ వర్షాకాలం వస్తే వేసిన మట్టిరోడ్డు, పైపులు కొట్టుకపోవడం పరిపాటిగా మారింది.
–గుండా యాదయ్య, పెద్దపూర్, ఉప్పునుంతల మండలం

ప్రతిపాదనలు పంపించాం..

మొల్గర వద్ద దుందుబీ వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.30కోట్ల అంచనా వ్యయంతో గతేడాది ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. చిన్న పాటి వానలు కురిసినా ఈరోడ్డుపై రాకపోకలు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు పునరుద్ధరించాం.
–జలంధర్, డీఈ ఆర్అండ్‌బీ, అచ్చంపేట

కాంగ్రెస్ నాయకులపై అకారణంగా దాడి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి


అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందనూలు: రిజర్వాయర్ సందర్శనకు వెళ్లిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులపై అకారణంగా బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి అన్నారు. బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి, గెలిచాక మార్కండేయ ప్రాజెక్టును నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నత్తనడకన చేస్తున్న పనులు శనివారం పార్టీ నాయకులు పరిశీలించడానికి వెళ్లినప్పుడు కొందరు బీఆర్ఎస్ గుండాలు దాడికి దిగారని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, పోలీసులను అడ్డుపెట్టుకొని దాడులకు దిగాలని చూస్తే సహించేది లేదని అన్నారు. నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. మర్రి జనార్దన్‌రెడ్డి అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు తల్చుకుంటే నీ పరిస్థితి ఏంటో తెలుసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో తల్లిని చితకబాదిన తనయుడు

కందనూలు: మద్యం మత్తులో తల్లిని కొడుకు చితకబాదిన ఘటన జిల్లా కేంద్రంలో శ్రీపురం రోడ్డులో ఆదివారం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్ మద్యానికి బానిసై ప్రతిరోజు మద్యం సేవిస్తూ.. జులాయిగా తిరగడంతోపాటు, తల్లితో గొడువ పడుతుండే వాడు. ఆదివారం మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కారణంతో తల్లితో వాదనకు దిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో పట్టణంలోని శ్రీపురం రోడ్డులోని ప్రధాన రహదారిపై తల్లితో గొడవపడ్డాడు. గొడవను స్థానికులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కన్నతల్లిని నడిరోడ్డు పైనే చితకబాదిన సంతోష్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కొత్త జబ్బులకు స్వాగతం

వనపర్తి జిల్లా ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్త

వనపర్తి క్రైం: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుద్ధ్యం పడకేసింది. ఆసుపత్రిలో పలు విభాగాల వద్ద చెత్తా చెదారం పేరుకుపోతోంది. సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన వచ్చి ప్రజలు, రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆస్పత్రి ప్రాంగణం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా ఆస్పత్రిలో పేషంట్ కేర్‌లో 16, శానిటేషన్ 32మంది, సెక్యూరిటీ 11మంది, సూపర్‌వైజర్స్ ముగ్గురిని నియమించారు. అలాగే మాత శిశు సంరక్షణ కేంద్రంలో 15 మంది పేషంట్ కేర్ సిబ్బంది, 35 మంది శానిటేషన్, 15మంది సెక్యూరిటీ సిబ్బంది, ముగ్గురు సూపర్ వైజర్స్ పనిచేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే వారు ఉన్న జబ్బును తగ్గించుకోవాల్సింది పోయి, కొత్తవి వచ్చేలా పరిసరాలున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ వారు అందుబాటులో లేకపోవడంతో రోగుల కుటుంబ సభ్యులే శుభ్రం చేసుకుంటున్నారు. దీనిపై సూపరింటెండెంట్ నరేంద్రకుమార్‌ను వివరణ కోరగా.. విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


జిల్లా ఆస్పత్రిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితం

పీయూ అంతర్జాతీయ సదస్సులో మాజీ వైస్‌చాన్స్‌లర్ రాజారత్నం



మాజీ వీసీ రాజారత్నంను సన్మానిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందని పీయూ మాజీ వీసీ రాజారత్నం అన్నారు. పీయూలో ఆదివారం రెండోరోజు కొనసాగిన అంతర్జాతీయ సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు, యోగ వంటి అనేక అంశాలు మనిషిని ఆరోగ్యవంతంగా, నిత్యనూతనంగా ఉంచుతాయని, దీని ద్వారా మనిషి మానసిక పరిస్థితి మెరుగుపడుతుందని చెప్పారు. పీయూలో గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఉండేది కాదని.. ప్రస్తుత వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాలమూరు జిల్లాలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో స్థానికంగా ఉండే విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం కల్పించడం గొప్ప విషయం అన్నారు. అంతేకాకుండా క్రీడలకు సంబంధించి పలు అభివృద్ధి పనులు సైతం చేపట్టడం శుభపరిణామన్నారు. వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అనూహ్యమైన స్పందన రావడం గొప్ప విషయం అని, పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు ఇక్కడ పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించి వారి ప్రతిభను చాటారని పేర్కొన్నారు. స్పీకర్‌గా హాజరైన బ్రహ్మకుమారి వసంత మాట్లాడుతూ మెంటల్ విజనరీ అండ్ మైండ్ అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్, మలేషియా యూనివర్సిటీ అధ్యాపకులు లిమ్ బూన్ హూయి, గురుదీప్‌సింగ్, నీరజ్‌జైన్, రాజేష్ కుమారజ్, దీప్త, పిండి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీరోటిల్లేజ్ పద్ధతిలో సాగు


జీరోటిల్లేజ్ విధానంలో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు(ఫైల్)

అలంపూర్: సాధారణంగా వరి పంట సాగు చేసిన రైతులు పంట కోత తర్వాత తిరిగి అదే పంట సాగు చేసి దిగుబడి కోల్పోతున్నారు. అయితే వరి సాగు చేసిన రైతులు అదే పొలంలో దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు చేసుకోనే అవకాశం ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. ఈ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేసే విధానాన్నే జీరోటిల్లేజ్‌గా పేర్కొంటున్నారు. ఈ విధానంలో పంట సాగు చేస్తే రైతులకు పంట మార్పిడితో పాటు అధిక దిగుబడి సాధించుకోనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సాగు నీటి ప్రాజెక్టుల కింద సాగు చేసే రైతులు ఈ విధానం ద్వారా మొక్కజొన్న సాగు చేసుకోవాలని సలహాలు అందజేస్తున్నారు.

పంట సాగు విధానం

- జీరోటిల్లేజ్ పంట సాగుకు ఎకరం పొలానికి 8 నుంచి 10 కిలోల విత్తనాలు అవసరం ఉంటుంది.
- ఎం–45ను కిలో విత్తనంలో మూడు గ్రాముల చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- విత్తనాలను తాడు సాయంతో విత్తుకోవాలి.
- పొలంలో వరుసకు మరో వరుసకు 60 సెం.మీ. మొక్కకు మొక్కకు 20 సెంటీమీటర్ల దూరం ఉండే విధంగా చూసుకోవాలి.
- విత్తనాలు విత్తిన 48 గంటల తర్వాత అట్రాజిన్ కిలో, ప్యారా క్వాట్ లీటర్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పొలం మొత్తం పిచికారి చేసుకోవాలి.
- అట్రాజిన్ మొక్కజొన్నలో వచ్చే కలుపును నివారిస్తుంది.
- ప్యారాక్వాట్ వరి దుబ్బలను మొలకెత్తకుండా అరికడుతుంది.

ఈ విధానంతో కలిగే లాభాలు

- నీటి వినియోగం తగ్గుతుంది.
- ఎకరా వరి పండించే నీటితో రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేసుకోవచ్చు.
- రైతుకు దుక్కి దున్నే ఖర్చులు మిగిలిపోతాయి.
- సాధారణ మొక్కజొన్న పంట కంటే 20 రోజుల ముందే పంట కోతకు వస్తుంది.
- పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుంది.
- పంట మార్పిడి చేసిన భూమి ఆరోగ్యంగా ఉంటుంది.

కావాల్సిన ఎరువులు

50 కిలో యూరియా (రెండు దఫాలుగా), 50 కేజీల డీఏపీ, 30 కిలోల పొటాష్, 20 కేజీల జింకు సల్ఫేట్ అవసరం ఉంటుంది.

పరామర్శకు వేళాయె

హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికి దత్తపుత్రుడు పవన్

- ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట పరామర్శ.. బాధితులను కాకుండా వీరిద్దరి పరస్పర పరామర్శలేంటని జనం ఆశ్చర్యం
- ఇటీవల ఇరుకు రోడ్డుపై బాబు సభ పెడితే 8 మంది మరణం
- ఆ తర్వాత కానుకలంటూ ఆశపెడితే మరో ముగ్గురు మృతి
- ఈ విషాదాల్లో మరణించిన వారిలో ఏ ఒక్క కుటుంబాన్నీ పరామర్శించని పవన్
- రోడ్లపై సభలను నిషేధించడాన్ని వ్యతిరేకిస్తూ బాబుకు పరామర్శ
- ఇటీవల విశాఖ విమానాశ్రయంలో మంత్రులపై జనసేన రౌడీల దాడి
- అప్పుడు పవన్‌ను విజయవాడకు పిలిపించుకుని బాబు పరామర్శ
- ఇవన్నీ మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమేనని ముందు నుంచీ చెబుతున్న వైఎస్సార్‌సీపీ


బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పవన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక ముసుగు రాజకీయాలు చేస్తూ వచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు పరామర్శల పేరుతో బహిరంగంగానే పరస్పరం మద్దతు ఇచ్చిపుచ్చుకుంటున్నారు. తామిద్దరం వేర్వేరు కాదని, ఒక్కటేనని నిరూపించుకుంటూ ఆదివారం మరోసారి కలిశారు. రెండు నెలల క్రితం చంద్రబాబు పవన్‌ను కలిసి పరామర్శించగా, ఇప్పుడు చంద్రబాబును పవన్ కల్యాణ్ పరామర్శించారు. ఈ పరామర్శలు నిజంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమా లేక రాజకీయం కోసమా అనేది ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది. అయినా ఇరు పార్టీల అధినేతలు బయటికి ఒకటి చెబుతూ.. లోపల మరొకటి చేస్తున్నారు. ఇరు పార్టీలు కలవకపోతే టీడీపీ పుట్టి పూర్తిగా మునగడం ఖాయం అని తాజాగా బాబు కుప్పం పర్యటనలో తెలిసిపోయిన నేపథ్యంలో ముసుగు తొలగించేందుకు సిద్ధమైపోయారు.

పవన్ పరామర్శించాల్సింది ఎవరిని?

హైదరాబాద్‌లో ఆదివారం చంద్రబాబు, పవన్ నిర్వహించిన సంఘీభావ సమావేశం ఎవరి కోసం? అని సర్వత్రా చర్చ జరుగుతోంది. కుప్పంలో ప్రజాదరణ లేక.. జరిగిన ఘటనల నేపథ్యంలో చంద్రబాబును పరామర్శించేందుకు వచ్చినట్లు పవన్ నర్మగర్భంగా చెప్పారు. కుప్పంలో చంద్రబాబును అడ్డుకున్నారని, ప్రతిపక్షాలను అడ్డుకోవడానికి జారీ చేసిన జీఓ నెంబర్ 1ను వెనక్కి తీసుకునేలా చేయడం కోసం తాము కలిసి పని చేస్తామని ప్రకటించారు. అయితే పవన్ కల్యాణ్‌కు ఇక్కడే ప్రజల నుంచి ఒక ప్రశ్న ఎదురవుతోంది. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఈ జీవో ఇచ్చేందుకు దారితీసిన పరిస్థితులు పవన్‌కు తెలియవా? తన ప్రచార ఆర్భాటం కోసం చంద్రబాబు కందుకూరులో చిన్న రోడ్డుపై సభ పెట్టడం ద్వారా 8 మంది ప్రజలు చనిపోవడానికి కారణమయ్యారు. ఆ తర్వాత గుంటూరులో కానుకల పంపిణీ అని ఆశపెట్టి పెద్ద సంఖ్యలో జనాన్ని రప్పించి, తొక్కిసలాట జరిగేలా చేసి, ముగ్గురు మృతి చెందడానికీ కారణమయ్యారు. ఈ రెండు ఘటనల్లో 11 మంది మృత్యువాత పడితే.. వారిలో ఏ ఒక్కరి కుటుంబాలను కూడా పవన్ పరామర్శించలేదు. పైగా ఈ ఘటనలేవీ పెద్ద విషయాలు కావన్నట్లు వ్యవహరించారు. అక్కడ చనిపోయిన కుటుంబాలను పరామర్శించాల్సిన పవన్.. అందుకు కారణమైన చంద్రబాబును పరామర్శించడం వింతల్లో కెల్లా వింత. ఇప్పటంలో రోడ్లను ఆక్రమించుకున్న వారిని పరామర్శించిన పవన్‌కు.. కూలి డబ్బుల కోసం ఆశపడి సభలకు వచ్చి చనిపోయిన వారిని పరామర్శించేందుకు మాత్రం మనసు రాలేదు. తన సభలకు జనం రాకపోవడంతో ఇరుకు సందులు, కానుకల పేరుతో పేదలను మభ్యపెట్టిన విషయం చర్చకు రాకుండా, కేవలం తమను ఆపడానికే రోడ్లపై బహిరంగ సభలు పెట్టకూడదనే జీఓ ఇచ్చారని కొత్త పల్లవి అందుకున్నారు. జనం చచ్చిపోయినా పర్వాలేదు.. తాము మాత్రం ఏ సందులోనైనా, గొందులోనైనా సభలు పెడతాం, తమను ఎవరు ప్రశ్నించకూడదని చంద్రబాబు, దత్తపుత్రుడు ఈ సమావేశం ద్వారా కుండబద్దలు కొట్టారు. దీనికి ప్రజాస్వామ్య పరిరక్షణ అనే ముసుగు వేశారు. విశాఖలో మంత్రులపై దాడి చేయించి.. దానికి కారణమైన పవన్‌ను పరామర్శించిన చంద్రబాబు రెండు నెలల క్రితం ఇదే తరహాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంఘీభావ సమావేశం నిర్వహించారు. అందుకు విశాఖలో జరిగిన పరిణామాలను ఉపయోగించుకున్నారు. తన విశాఖ పర్యటనలో మంత్రులు, వారి అనుచరులపై జనసేన రౌడీ మూకలతో పవన్ దాడి చేయించి ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు అడ్డుకుంటే బాబు సూచన మేరకు పవన్ విజయవాడకు వచ్చి హల్ చల్ చేశారు. విశాఖలో తనను బయటకు రానీయలేదని రెచ్చిపోయి అధికార పార్టీ నేతలను దుర్భాషలాడుతూ, చెప్పు చూపిస్తూ నానా హంగామా చేశారు. ఆ సమయంలో మంత్రులపై జరిగిన దాడి, శాంతి భద్రతల అంశాన్ని పట్టించుకోకుండా దానికి కారణమైన పవన్‌కే ఎంతో అన్యాయం జరిగిపోయినట్లు తెగ బాధపడిపోయిన చంద్రబాబు ఉన్న పళాన తన ముసుగు తీసి పవన్‌ను విజయవాడ నోవాటెల్ హోటల్‌లో కలిసి సంఘీభావం ప్రకటించారు. నిజానికి విశాఖ ఘటనలో బాధితులు ఎవరు, పరామర్శించాల్సింది ఎవరిని? ఇవేమీ జనానికి తెలియదన్నట్లుగా వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు వారిద్దరూ కలిసి ఒక అవకాశం సృష్టించుకుని అప్పట్లో కలుసుకున్నారు. అప్పటివరకు వేర్వేరుగా పని చేస్తున్నట్లు ప్రజలను ఏమార్చినా, ఇక లాభం లేదని ఇద్దరూ ఒక్కటేనని నిరూపించారు. ఆయా ఘటనల్లో బాధితులను పరామర్శించాల్సింది పోయి.. బాబు, పవన్‌లు ఇద్దరూ పరస్పరం పరామర్శలు ఏమిటని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమని.. పవన్, చంద్రబాబులు ఇద్దరూ ఒక్కటేనని, ఎలాగైనా బాబుకు మేలు చేయాలని పవన్ తహతహలాడుతున్నారని, జనసేన కార్యకర్తలను బలి పశువులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ చెబుతూనే ఉంది. ఈ నేపథ్యంలో తాను ఎప్పటికీ బాబు మిత్రుడినేనని పవన్ తాజాగా మరోమారు నిరూపించుకున్నారు. ముసుగు లోపలి చిత్రం స్పష్టంగా కనిపిస్తున్నా, జనసేనాని మాత్రం తన కార్యకర్తలకు దగా చేస్తూ ఇంకా బీరాలుపోతున్నారు. పవన్ తీరు తమకూ అర్థం కావడం లేదని బీజేపీ నేతలు వాపోతున్నారు.

జనసేనకు బాబు రోడ్‌మ్యాప్

తాజాగా చంద్రబాబు, పవన్‌ల భేటీలో తమ భవిష్యత్తు ప్రణాళికతోపాటు పవన్ ఎలా పని చేయాలి, ఏం చేయాలనే అంశాలపై చంద్రబాబు ఒక రోడ్ మ్యాప్ ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయడం, సీట్ల కేటాయింపు, ఉమ్మడి రాజకీయం ఎలా చేయాలనే అంశాలపై చర్చ జరిగినట్లు టీడీపీ నేత ఒకరు తెలిపారు. ఈ సమావేశం జరిగిన వెంటనే జనసేనకు 30 సీట్లు ఇచ్చేందుకు చంద్రబాబుకు అంగీకరించారని, అందులో కొన్ని స్థానాలు కూడా ఖరారయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తుతోంది. ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక పేరుతో నిర్వహించే కార్యక్రమాలు, అక్కడ ఏం మాట్లాడాలి.. వంటి అంశాలపై చర్చించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జీవో నంబర్ ఒకటిపైనే కలిశాం

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ వెల్లడి
- పొత్తుల గురించి మాట్లాడటానికి ఇంకా సమయం ఉంది
- ఎప్పుడు ఏం చేయాలో మాకు వ్యూహాలుంటాయి.. సమయం వచ్చినప్పుడు మాట్లాడతాం
- పవన్‌తో కలిసి మీడియా సమావేశంలో చంద్రబాబు
- చెప్పేది వినండంటూ మీడియాపై చిందులు

సాక్షి, హైదరాబాద్, అమరావతి: జీఓ నంబర్ -1 పై చర్చించేందుకే తాము సమావేశమైనట్లు తెలుగు దేశం, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చెప్పారు. హైదరాబాద్‌లో ఆదివారం చంద్రబాబును పవన్ కల్యాణ్ కలిశారు. ఉదయం 11.30 గంటలకు చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్.. రెండున్నర గంటలకు పైగా అక్కడ గడిపారు. అనంతరం ఇద్దరూ సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ.. కుప్పంలో పోలీసుల ద్వారా తన పర్యటనను అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, అంతకుముందు వైజాగ్‌లో, ఇప్పటంలో పవన్‌ను కూడా అడ్డుకుందని చంద్రబాబు మండిపడ్డారు. బ్రిటిష్ కాలం నాటి చట్టం తెర మీదకు తెచ్చారని, దానికి ఉన్న చట్టబద్ధత ఏంటో కూడా తెలియకుండా జీవో నెంబర్ 1 అనే నల్ల జీవోతో ఆంక్షలు పెట్టారని తెలిపారు. రాజకీయాల్లో పొత్తులు సహజమని, 2009లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)తో పొత్తు పెట్టుకున్నామని, ఆ తర్వాత ఆ పార్టీతో విభేదించామని తెలిపారు. ఎప్పుడు ఏం చేయాలో తమకు వ్యూహాలు ఉంటాయని, రాజకీయాల్లో సమీకరణాలు మారుతుంటాయని, వాటి గురించి సమయం వచ్చినప్పుడు మాట్లాడతానన్నారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనల వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. సభలు, మీటింగ్‌లు జరుగుతున్నప్పుడు బందోబస్తు ఇవ్వాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలపై ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో పోరాటం చేస్తామన్నారు. ప్రజా పోరాటం, న్యాయ పోరాటం కూడా చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఇటు గవర్నర్ నుంచి అటు రాష్ట్రపతి వరకు అందరినీ కలుస్తామన్నారు. అవసరాన్ని బట్టి కేంద్రం కూడా జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ కంటే భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.

చంద్రబాబును అడ్డుకోవడం దుర్మార్గం

కుప్పంలో చంద్రబాబును అడ్డుకోవడం సరికాదని, ఆ విషయం గురించి చర్చించేందుకే ఇక్కడికి వచ్చానని పవన్ కల్యాణ్ అన్నారు. ఓడిపోతామనే భయంతో చెత్త జీవోలను తెస్తున్నారని, విశాఖలో తనపైనా ఆంక్షలు పెట్టారని విమర్శించారు. ఇప్పుడు సీనియర్ నేత చంద్రబాబును కూడా అడ్డుకుంటున్నారని, ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా పని చేసిన వ్యక్తి పట్ల ప్రభుత్వం ఇలా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. నిబంధనలన్నీ ప్రతిపక్షాల కేనని, అధికార పక్షానికి వర్తించవని మండిపడ్డారు. సభలు జరుగుతుంటే శాంతి భద్రతలు చూడాల్సింది ప్రభుత్వ యంత్రాంగమేనని, పోలీసులు బందోబస్తు ఇవ్వకపోతే ఏమనాలని ప్రశ్నించారు. కందుకూరు, గుంటూరు ఘటనలు సెక్యూరిటీ వైఫల్యమని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలు ఫలితాన్నిస్తుంటే, గుంటూరులో అంత మంది ప్రజలు సంక్రాంతి కానుక కోసం ఎందుకు తరలి వచ్చారో చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ అరాచకాలను అడ్డుకునేందుకు బీజేపీని కూడా సంప్రదిస్తానన్నారు. ఏపీలోకి బీఆర్ఎస్ రావడాన్ని స్వాగతిస్తున్నామని, తెలంగాణ వాదాన్ని వదిలి దేశమంతా పోటీ చేస్తామంటే ఆహ్వానిస్తామన్నారు.

వినవయ్యా విను.. మీడియాపై అసహనం

చంద్రబాబు మీడియాతో మాట్లాడిన తర్వాత ప్రశ్నలు వేసిన విలేకరులపై పలుమార్లు ఆయన అసహనానికి లోనయ్యారు. ఒకరిద్దరు అటు ఇటు తాళం వేస్తున్నారంటూ ఎగతాళి చేశారు. 'మా గురించి ఇన్ని మాట్లాడుతున్నారు.. మీరేం చేస్తున్నారు? అంటూ ఎదురు ప్రశ్నలు వేశారు. 2930 జీవోను ఎందుకు వ్యతిరేకించలేదన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు మీడియా వాచ్ జీవో తెస్తే విలేకరులు ఏకమయ్యారని, ఈ జీవో మీద ఒక్క మీడియా కూడా ముందుకు రాలేదని ఆక్షేపించారు. 'అప్పుడు పోటుగానివా.. ఇప్పుడు ఎందుకు భయపడుతున్నావ్?' అని నిలదీశారు. 'మీకు రోషం ఉంటే నన్ను అడగడానికి ముందు మీరు రాయండి. అప్పుడు మాట్లాడుదాం.. ముందు చేప్పేది వినవయ్యా.. నువ్విక్కడున్నావ్.. ఓ సెలబ్రిటీ వస్తాడు. మనుషులు వస్తారు. సెలబ్రిటీని మనుషులు కంట్రోల్ చేస్తారా? పోలీసులా? ఫండమెంటల్‌గా అర్థం చేసుకోకుండా ప్రశ్నలు వేస్తారా? అందుకే వాళ్లు (ఏపీ ప్రభుత్వం) ఇలాగే ఉంటారు' అని అసహనం వ్యక్తం చేశారు.

పరస్పర పరామర్శలతో ప్రజలను మోసం చేస్తారా?

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను నిలదీసిన మంత్రులు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: పరస్పరం పరామర్శించుకుంటూ ప్రజలను మోసం చేస్తారా? అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌లను మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, ఆదిమూలం సురేష్, దాడిశెట్టి రాజా, డిప్యూటీ సీఎంలు కొట్టు సత్యనారాయణ, రాజన్నదొర నిలదీశారు. ఆదివారం వారు వేర్వేరు ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు. గతంలో విజయవాడలో నోవాటెల్ హోటల్‌లో పవన్ కల్యాణ్‌ను చంద్రబాబు పరామర్శిస్తే.. ఆదివారం హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికెళ్లి పవన్ కల్యాణ్ పరామర్శించారన్నారు. వీరిద్దరి కలయికను ఆదివారం ఉదయం నుంచి మీడియా ఆశ్చర్యకర పరిణామంగా చూపిస్తోందని.. కానీ అందులో ఆశ్చర్యకరమైన అంశం ఏదీ లేదన్నారు. టీడీపీ, జనసేన వేర్వేరు పార్టీలు అనుకున్నప్పుడే వారిద్దరి భేటీ కీలక పరిణామం అవుతుందని, ఆ రెండు పార్టీలు ఎంత మాత్రం వేర్వేరు కావని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్ కల్యాణ్ జనసేనను స్థాపించినప్పుడు వారిద్దరి భేటీ కీలక పరిణామం ఎలా అవుతుందంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. వారిద్దరూ కలిసే ఉన్నారని, కలిసే పోటీ చేస్తారని.. సీఎం వైఎస్ జగన్, తాము ముందు నుంచి చెబుతూనే ఉన్నామని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రచార పిచ్చితో కందుకూరులో 8 మంది, గుంటూరులో ముగ్గురు పేదలను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. ఆ 11 కుటుంబాల వద్దకు వెళ్లి.. మమ్మల్ని క్షమించండి అని చంద్రబాబు, పవన్‌లు చెబుతారేమో అని ఆశించినవాళ్లు వారిద్దరి భేటీపై ఆశ్చర్యపోయారన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 1 వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని పార్టీలకూ, స్వచ్ఛంద సంస్థలకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ జీవో ప్రకారమే ఒంగోలులో బాలకృష్ణ సినిమా వీరసింహారెడ్డి.. విశాఖపట్నంలో చిరంజీవి సినిమా వాల్తేరు వీరయ్య ప్రీరిలీజ్ ఫంక్షన్‌లు నిర్వహించారని తెలిపారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కార్గో.. కాసుల పంట

ఆర్టీసీ కార్గో సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన

- రీజియన్‌కు రూ.8.21 కోట్ల ఆదాయం
- మొత్తం 8.19 లక్షల పార్సిళ్ల బుకింగ్
- ఆదాయంలో మహబూబ్‌నగర్‌దే అగ్రస్థానం
- మండలస్థాయిలో సేవల విస్తరణకు అడుగులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ ప్రారంభించిన కార్గో సేవలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ వినూత్నంగా 2020, జూన్ 19న కార్గో, పార్సిల్ కొరియర్ సేవలను ప్రారంభించింది. ఇందులో భాగంగా గతేడాది వేసవిలో మ్యాంగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారికి బంగినపల్లి మామిడి పండ్ల ప్యాకెట్లను ఇంటి వద్దకే చేర్చింది. అలాగే రాఖీ పండుగను పురస్కరించుకొని దూర ప్రాంతాలకు రాఖీలు పంపే సౌకర్యాన్ని కల్పించింది. ముఖ్యంగా గతేడాది జరిగిన సమ్మక్క, సారక్క జాతరను పురస్కరించుకొని భక్తులకు మేడారం ప్రసాదం, శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఇంటి వద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు అనే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సేవలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది.

9 కేంద్రాల ద్వారా..

మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని 9 కేంద్రాల ద్వారా 2020, జూన్ 19 నుంచి ఈ నెల 7 వరకు కార్గో పార్సిల్ సేవల ద్వారా రూ.8,21,61,045ల ఆదాయం వచ్చింది. రీజియన్ వ్యాప్తంగా 8,19,640 పార్సిల్, కొరియర్ బుకింగ్స్ చేశారు. కార్గో పార్సిల్, కొరియర్ సేవల్లో మహబూబ్‌నగర్ డివిజన్ రూ.6,30,40,872, నాగర్‌కర్నూల్ డివిజన్ రూ.1,91,20,173 ఆదాయం పొందింది. ప్రతిరోజు కార్గో సేవల ద్వారా రీజియన్‌కు రూ.1.70 లక్షల నుంచి రూ.1.90 లక్షల వరకు ఆదాయం వస్తోంది. నెలకు రీజియన్‌కు దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. నిత్యం దాదాపు 1,500 వరకు పార్సిల్, కవర్లను ఒక బస్టాండ్ నుంచి మరో బస్టాండ్‌కు చేరవేస్తున్నారు. కార్గో ద్వారా మంచి లాభాలు వస్తుండటంతో ఈ సేవలను మండల స్థాయికి విస్తరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.


వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కేంద్రం

డిపో	పార్సిల్	ఆదాయం (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	2,50,021	2,37,96,806
గద్వాల	1,68,398	2,03,25,641
వనపర్తి	85,321	72,46,083
నాగర్‌కర్నూల్	73,314	63,19,361
షాద్‌నగర్	47,710	60,53,890
నారాయణపేట	62,088	56,18,452
కల్వకుర్తి	54,755	52,61,787
కొల్లాపూర్	40,639	41,55,916
అచ్చంపేట	37,394	33,83,109

కేంద్రాలు పెంచుతాం..



ఆర్టీసీ కార్గో పరంగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం. మండల కేంద్రాల్లో ఆర్టీసీ కార్గో సేవలను విస్తరిస్తున్నాం. మరిన్ని కేంద్రాలను పెంచడానికి తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజల ఆదరణ వల్లే ఆర్టీసీ కార్గో సేవల పరంగా రీజియన్‌కు ఆదాయం పెరిగింది. ఆర్టీసీకి ఉన్న బ్రాండ్ ఇమేజ్ కార్గోకు కూడా రావడానికి కృషి చేస్తున్నాం.
– గిరిమహేష్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్గో, నల్లగొండ, మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ డిపోదే..

పార్సిల్, కొరియర్ సేవలకు సంబంధించి రీజియన్‌లోని 10 డిపోల్లో మహబూబ్‌నగర్ డిపో అధిక ఆదాయం ఆర్జిస్తూ అగ్రస్థానంలో కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ డిపో ఇప్పటి వరకు రూ.2,37,96,806 ఆదాయాన్ని ఆర్జించింది. ముఖ్యంగా డిపోకు హైదరాబాద్ రూట్లో ఎక్కువగా కార్గో ఆదాయం సమకూరుతోంది. ఈ రూట్లోనే అధిక సంఖ్యలో కొరియర్, పార్సిల్ బుకింగ్ అవుతున్నాయి. గద్వాల డిపో రూ.2,03,25,641ల ఆదాయంతో రెండో స్థానంలో ఉంది. అదేవిధంగా మహబూబ్‌నగర్ రీజియన్‌లో ఆర్టీసీ కార్గో బస్సుల ద్వారా కూడా సేవలు అందజేస్తున్నారు. ఆర్టీసీ కార్గో బస్సు సేవలను 2020, జూలై మొదటి వారంలో ప్రారంభించగా ఈ నెల 7 వరకు రూ.34,35,673 ఆదాయం వచ్చింది. కార్గో బస్సుల్లో రీజియన్ పరిధిలో కల్వకుర్తి డిపో రూ.20,94,059ల ఆదాయం పొందింది.

కృష్ణానదిలో తేలిన పెద్దదర్గా



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో 391 ఏళ్ల చరిత్ర గల పెద్ద దర్గా కృష్ణానదిలో నీరు తగ్గడంతో తేలింది. హాజి హజ్రత్ సయ్యద్ షా మహమ్మద్ దర్వేష్ అలీ షా ఖాద్రి పురాతనమైన ఈ దర్గా కృష్ణానదిలో 6 నెలల పాటు మునిగి ఉండి, 6 నెలల పాటు పైకి కనిపిస్తుంది. నీళ్లు తగ్గడంతో దర్గా దర్శనమిచ్చింది. పీఠాధిపతి సయ్యద్‌పురానోద్దీన్ దర్గాను శుభ్రపరిచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి ఆలయంలో 26వ తేదీన వసంతపంచమి సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. ఆదివారం ఆలయంలో ఎమ్మెల్యే బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అదే విధంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలు, క్షేత్ర వైభవాన్ని చాటి చెప్పే క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ మాట్లాడుతూ క్యాలెండర్‌లో ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు, దేవస్థాన సమాచారం పొందుపరిచినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, ఆలయ కమిటీ ధర్మకర్తలు పాల్గొన్నారు.


పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఆలయాన్ని దర్శించిన వికారాబాద్ ఎమ్మెల్యే

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను ఆదివారం వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు సాదర స్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు.

రామన్‌పాడుకు 1,002 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,020అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 802 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 120, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రసీల్‌రెడ్డి తెలిపారు.



మతోన్మాదుల ఆగడాలను అరికట్టాలి

- కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలో మతోన్మాదుల ఆగడాలు, ఉద్రిక్త పరిస్థితులను సృష్టిస్తున్నాయని, భావ ప్రకటనను, స్వేచ్ఛలు ధ్వంసం అవుతున్నాయని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఐటీయూ, కేవీపీఎస్ శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో విద్యా, వైద్యం ఉపాధి వంటి అంశాలు చర్చకురాకుండా మతాన్ని, దేవుడి రాజకీయాలకు దట్టించి విద్వేషపూరిత వాతావరణం సృష్టిస్తున్నారని అన్నారు. ఇది దేశ సమైఖ్యతకు భారీ నష్టం కలిగిస్తుందన్నారు. విమర్శ చేసిన ప్రతి ఒక్కరిని ఏదో ఒక రూపంలో హింసిస్తున్నారని, రాజ్యాంగంలోని భావప్రకటన స్వేచ్ఛను భౌతిక దాడులతో హరిస్తున్నారని, పౌర హక్కులు కాలరాసేలా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికి దళితులపై ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని వీటిని అరికట్టడంలో టీఆర్ఎస్ విఫలమైందని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాలల్లో దళిత ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై సైన్స్ చెప్పడం నేరంగా భావించిన ఆర్ఎస్ఎస్, బీజేపీ దుండగులు బలవంతంగా వేధించి, కులం పేరుతో దూషించి అవమానించారని పేర్కొన్నారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపైన దాడులు అధికమయ్యాయని ఈ దాడుల వెనకాల మతోన్మాదుల శక్తుల హస్తం ఉందన్నారు. దేశంలోని 70 కోట్ల మంది మహిళలను రాందేవ్‌బాబ దూషించినప్పుడు, మహిళల మనోభావాలు దెబ్బతిన్నప్పుడు ఎందుకు అరెస్టు చేయలేదని విమర్శించారు. మతం, మతోన్మాదంపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, హనుమంతు, భాస్కర్, అశోక్, జగన్, హనుమంతు, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

జనాభా దమాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ పెంచాలి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రస్తుతం ఉన్న దళిత జనాభా దమాషా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్ 20 శాతానికి పెంచాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు డిమాండ్ చేశారు. మాలల చైతన్య సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ దేశంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అణగారిన వర్గాల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని విద్య, ఉద్యోగ, స్వేచ్ఛ, సమానత, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో చట్టపరమైన రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అధికారంలో ఉన్న అగ్రకుల మనువాదులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. దేశంలో ఉన్న బహుజనుల బతుకులు మారాలంటే ఓట్లు మావే సీట్లు మావే నినాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో గోవిందయ్య, తిరుపతిరావు, దామోదర్, శ్రీనివాస్, రజనీబాబు, వెంకటస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

పనుల్లో నాణ్యత లోపించొద్దు



పాన్‌గల్: పాఠశాలల్లో మన ఊరు, మన బడి పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని పీఆర్ ఏఈ సత్తయ్య అన్నారు. శనివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సర్పంచ్ రేణమ్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన పనులను నిబంధనల మేరకు నాణ్యతగా త్వరగా పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలుపుదల చేస్తామన్నారు. అనంతరం వారు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మణ్ యాదవ్, ఉప సర్పంచ్ బాలస్వామి, మౌలాలి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు నడపండి



ఖిల్లాఘనపురం: మండల కేంద్రం మీదుగా వనపర్తి నుంచి హైదరాబాద్‌కు బస్సు నడపాలని శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి, సీఐ చంద్రమౌళికి సామాజిక కార్యకర్త కమ్మరి గోపి, పల్లాటి శ్రీనివాసులు మండల ప్రజల తరుపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతు డీఎంకు వినతి పత్రం ఇచ్చిన వెంటనే ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. వనపర్తి డిపో నుంచి ఖిల్లాఘనపురం మీదుగా సోమవారం నుంచి ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌కు బస్సును నడుపుతామని తెలిపారన్నారు. అడిగిన వెంటనే బస్సు నడిపేందుకు ముందుకు వచ్చిన డీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

బడిబయటి పిల్లల గుర్తింపునకే ఇంటింటి సర్వే



పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బడి బయట పిల్లల గుర్తింపునకే సీఆర్పీల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని గోప్లాపూర్, బండపల్లి గ్రామాల్లో సీఆర్పీలు ఇంటింటికి తిరుగుతూ ఆరేళ్ల నుంచి 19ఏళ్ల వయస్సు గల పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పిస్తున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు. చదువుతో కలిగే లాభాలను తల్లిదండ్రులకు వివరిస్తూ తమ పిల్లలను పనులకు కాకుండా బడికి పంపించాలని సూచిస్తూ బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, భార్గవి, రమాదేవి, ఐఈఆర్పీ నరేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

వనపర్తి టౌన్: మహబూబ్‌నగర్‌లో ఈనెల 5, 6వ తేదీల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో వనపర్తి ప్రభుత్వ కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. వాలీబాల్, షాట్‌పుట్, జావల్‌త్రో, షటిల్, ఖోఖో, 200 మీటర్ల రన్నింగ్ పోటీలో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా శనివారం గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.

మొక్కలు మేసిన మేక యజమానికి జరిమానా

అమరచింత: పట్టణంలో పచ్చదనం విస్తరించాలన్న సంకల్పంతో డివైడర్‌పై నాటిన మొక్కలను తిన్న మేకను పట్టుకొని యజమానికి రూ.ఐదు వందలు జరిమానా విధించామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో నిర్మించిన డివైడర్‌పై పచ్చని పూల మొక్కలను నాటినట్లు ఆయన తెలిపారు. వీటిని సంరక్షించేందుకు నిత్యం నీటిని అందిస్తున్నామన్నారు. పట్టణంలోని మేకల మంద ఎక్కువైందని, దీంతో నాటిన మొక్కలను తింటుండటంతో వాటిని అరికట్టాలనే ఉద్దేశ్యంతో జరిమానా విధిస్తున్నామన్నారు. మరోమారు మొక్కలను మేకలు తింటూ తమ సిబ్బందికి కనిపిస్తే ఇకపై రూ.5 వేలు జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఆత్మకూర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ తదితరులు

ఆత్మకూర్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ పుట్ట మహేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని జాతర మైదానంలో స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు పరుగు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దివాన్జీ ప్రభాకర్‌రావు, లింగన్న, సంతోష్, బాలు, మ్యాడం శ్రీను, రమేష్, ఉదయ్, రఘు, మహేష్, పీఈటీలు పరమేష్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

మదనాపురం: మండల కేంద్రంలో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను వనపర్తి డీఎస్పీ ఆనంద్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 12వ తేదీన నేషనల్ యూత్ డే ను పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో 12 టీంలు పాల్గొన్నాయి. గెలుపొందిన టీం లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ రత్నం, ఎస్ఐ మంజునాథరెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల ద్వారా మానసిక స్థైర్యం పెరుగుతుందని ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి యువజన దినోత్సవం రోజున బహుమతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను సీఐ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు యువకులు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు క్రీడలు తప్పనిసరి అని, అప్పుడే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామస్వామి పాల్గొన్నారు.



మదనాపురంలో..



పెబ్బేరులో..



అమరచింతలో..

మొక్కల సంరక్షణకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: హరితహారంలో భాగంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ బాలయ్య తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్, ధర్మాపురం గ్రామాల ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన హరిత మొక్కలకు సంరక్షణ కరువైందనే విషయాన్ని సాక్షి దినపత్రికలో శనివారం 'మొక్కల సంరక్షణ ఏదీ' అన్న శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. సాక్షిలో వచ్చిన కథనానికి డీఆర్‌డీఓ నరసింహులు స్పందించారు. వెంటనే ఏపీఓ బాలయ్యకు మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలయ్య ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో కలిసి నేలకొరిగిన, వాడుముఖం పట్టిన, ట్రీగార్డు లేని మొక్కలను గుర్తించి వాటిని సంరక్షించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన సాక్షికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

పాన్‌గల్: మండలంలోని కదిరెపాడుకు చెందిన చొప్పరి నారాయణకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 60 వేల చెక్కును శనివారం బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో రామకృష్ణ, రమేష్, విష్ణు, సుధాకర్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈమేరకు సంక్రాంతి పర్వదినం అనంతరం ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనుందని తెలిపారు. 18 ఏళ్ల వయస్సు నుంచి ఆపై వయస్సు ఉన్నవారికి కంటి వెలుగుపై అవగాహన కల్పించి, వారు శిబిరాలకు వచ్చే విధంగా వార్డు కౌన్సిలర్లు చొరవ చూపాలన్నారు. కంటి అద్దాలతో పాటు కంటి చికిత్స అవసరం ఉన్న వారికి వెలుగును ప్రసాదించే సౌకర్యాన్ని కల్పించిందన్నారు.

పది శిబిరాలు

పట్టణంలోని 10 వార్డుల్లో వార్డుకొక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. వాటిని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయాన్ని వార్డుల వారిగా పరిశీలించి నిర్ణయిస్తామన్నారు. అంగన్‌వాడీలు, ఆర్పీలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పట్టణంలో విస్తృతంగా పర్యటిస్తు కంటివెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కంటిచూపు మందగించిన వారి వివరాలను ఆయా వార్డుల వారిగా అంగన్‌వాడీలు, ఆర్పీలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల పదజాలంపై పోటీ పరీక్ష



శ్రీరంగాపురంలో పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తకోట: విద్యార్థులు ఆంగ్లంపై నైపుణ్యం పెంచుకోవాలని శనివారం మండల విద్యాధికారి కృష్ణయ్య అన్నారు. ఆంగ్లబాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ పోటీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంజులత, ప్రవీణ్, ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, మాధవి, జ్యోతి, విష్ణువర్ధన్, అనీజా పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో కథలు, ఆంగ్ల పదజాలంపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలో 8, 9వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా భవ్యశ్రీ, జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల శ్రీరంగాపురం, అవంతిక కేజీబీవీ శ్రీరంగాపురం, రెండో స్థానంలో అనూష జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల శ్రీరంగాపురం, మానస జెడ్పీహెచ్‌ఎస్ వెంకటాపురం ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22న జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం కురుమయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు రవి, కృష్ణవేణి, జ్యోతి, నయనానంద, భరత్‌కుమార్, అనిత పాల్గొన్నారు.

నేటి నుంచి సుందరగిరి పరమేశ్వర జాతర



ఉత్సవ విగ్రహాలు

కొత్తకోట: మండలంలోని అప్పరాల శివారులో వెలసిన సుందరగిరి పరమేశ్వర జాతర ఆదివారం నుంచి రెండు రోజులపాటు ఎంతో వైభవంగా సాగనున్నాయి. ఈ మేరకు అప్పరాల సమీపాన శ్రీ సుందరగిరి కొండపై వెలిసిన ఆది దేవుడైన పరమేశ్వరుడి జాతరను వైభవంగా నిర్వహించేందుకు సర్పంచ్ హిమబిందు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏడాది పుష్య మాసంలో పౌర్ణమికి దగ్గరగా ఉండే సోమవారం రోజు స్వామి వారి ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందరగిరి గుట్టపైకి పల్లకీ సేవతో తీసుకొస్తారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి అభిషేకం, రాత్రి 9గంటలకు మహా రుద్రాభిషేకం, మహానైవేద్యం, అన్నదాన కార్యక్రమాలు సాగుతాయి. అర్ధరాత్రి 11 గంటల నుంచి వీరభద్రుని నందికోళ్ల సేవలు ఉంటాయి. మంగళవారం తెల్లవారు జామున భక్తులు భగ భగ మండుతున్న నిప్పులపై అగ్ని గుండం ప్రవేశం చేసి వారి భక్తిని చాటుకుంటారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దించే వరకు పోరాటం



మాట్లాడుతున్న బుక్క వేణుగోపాల్

వనపర్తి క్రైం: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు బీజేపీ పోరాటం ఆగదని వనపర్తి బీజేపీ అసెంబ్లీ పాలక్ బుక్క వేణుగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో అసెంబ్లీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం నిర్వహించారు. బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనాన్ని ఉద్దేశించి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బుక్క వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని రైతులకు హామీ ఇచ్చి, నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికే చేయలేదని దుయ్యబట్టారు. రైతులకు ఇచ్చే వాహనాల సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థను కేసీఆర్ బంధు పెట్టారని.. కేవలం రైతుబంధు పేరుతో రైతులను నట్టేట ముంచుతున్నాడని మండిపడ్డారు. గడిచిన ఎనిమిదేళ్లలో లక్ష డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని చెప్పి.. కేవలం గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకు పరిమితం చేశాడని ఆరోపించారు.

కలగానే కేజీ టు పీజీ విద్య

కేజీ టు పీజీ విద్య కలగానే మిగిలిపోయిందని, కనీసం పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర పాలకులు ఉన్నారన్నారు. హుజురాబాద్ ఎన్నికల కోసం తీసుకొచ్చిన దళితబంధు పథకం నేడు మూలకు పడేశారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైతుల ఆత్మహత్యల్లో దేశంలో నాలుగోస్థానంలో నిలిచిందని, దీనికి సీఎం కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బాధ్యత వహిస్తూ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో రూ.1.35లక్షల కోట్లు కాజేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జీ ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు నారాయణ, సీతారాములు, ఆర్.వెంకటేశ్వర్‌రెడ్డి, జ్యోతి రమణ, కల్పన, సంతోష్ కుమార్, కుమారస్వామి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

వీపనగండ్ల: క్రీడల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తేనే స్నేహభావం వెల్లివిరుస్తుందని ఎస్ఐ రామన్‌గౌడ్ అన్నారు. ఈ నెల 12న వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆది, సోమవారం రెండు రోజుల పాటు కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

గోపాల్‌పేట: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి నేషనల్ యూత్‌డే సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నవీద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి క్రికెట్ పోటీల్లో ఆసక్తి ఉన్న జట్లు పాల్గొనాలని, మొదటి బహుమతి రూ.పది వేలు, షీల్డ్, రెండో బహుమతి రూ.ఐదు వేలు, షీల్డ్ అందిస్తామన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ఆనంద్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

ఎల్ఈడీ లైట్లకు రూ.లక్ష కేటాయింపు

మదనాపురం: కలెక్టర్ షేక్ యాస్మీన్‌బాషా నిధుల నుంచి రూ.లక్ష కేటాయించి గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారం మరువలేనిదని శంకరమ్మపేట సర్పంచ్ పద్మమ్మ, ఉపసర్పంచ్ డబ్బా కృష్ణయ్య పేర్కొన్నారు. ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయడానికి కలెక్టర్ మంజూరు చేసిన రూ.లక్షకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను శనివారం మదనాపురంలో జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రావణ్ కుమార్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, సర్పంచ్‌లు రాంనారాయణ, కురుమూర్తి, ప్రవీణ్ రెడ్డి, రాజ్‌కుమార్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలి



కొత్తకోట: యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2 కే రన్ కార్యక్రమంలో వివేకానంద జయంతిని పురస్కరించుకొని పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పొగాకు సుఖేశిని, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతు స్వామి వికేకానంద ప్రజల కోసమే పుట్టి ఉన్నత శిఖరాలను చేరి జీవితాన్ని అంకితం చేశారని, ఆయన జీవితం గురించి యువత తెలుసుకోవాలని గుర్తుకు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

వివాహాలకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి

వనపర్తి టౌన్: వివాహ, శుభకార్యాలకు టీఎస్ ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని ఆర్టీసీ డీఎం పరమేశ్వరి కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌ను సందర్శించి, ఫంక్షన్ హాల్ యజమానితో ఫంక్షన్ హాల్ బుకింగ్‌కు వచ్చిన వాళ్లకు ఆర్టీసీపై అవగాహన కల్పించి వివాహ శుభకార్యాలకు బస్సులను వినియోగించుకునేలా చూడాలన్నారు. పల్లె వెలుగు బస్సు కిలోమీటర్‌కు రూ. 66, ఎక్స్‌ప్రెస్ కిలోమీటర్ 69 చొప్పున చార్జీలు వసూలు చేస్తామన్నారు. వనపర్తి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆర్టీసీ బస్సుల్లో సుఖవంతమైన ప్రయాణం చేయాలని కోరారు.



నాగుపాము కలకలం



వనపర్తి క్రైం: జిల్లాకేంద్రంలోని రాజనగరంలో తెలుగు కాజన్న ఇంటి స్నానపు గదిలో శనివారం నాగుపాము కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆయన నాగుపామును సురక్షితంగా పట్టుకొని అడవిలో వదిలేశారు. పాములు కనిపిస్తే వాటిని చంపకుండా సమాచారం అందించాలని కృష్ణసాగర్ కోరారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతలు చేపట్టాలి



ఆత్మకూర్‌లో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

పాన్‌గల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తపస్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జాతీయ భావాజాలతో కూడుకున్న సంఘమని, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించాలనే అకాంక్షతో ముందుకు వెళ్తున్నామన్నారు. నాలుగున్నరేళ్లుగా ఉపాధ్యాయ బదిలీలు, పదోత్నతులు లేవని వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు, పీఆర్సీ, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, జీఓ నెం.37లో నష్టపోయిన వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కర్ణ, మండల అధ్యక్షుడు వీరశేఖరచారి, రమేష్‌గౌడ్, విజయ్, శివనాయక్, సురేష్, జానకీరాములు, విష్ణువర్ధన్, రవి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో తపస్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్‌గౌడ్, బాలగౌడ్, శివనాయక్, నాగేషు, శశివర్ధన్, వీరశేఖరాచారి, సతీష్‌కుమార్, నాగేశ్వరమ్మ, కమల, కవిత, రాజస్వప్న, సుజాత, జయలక్ష్మి, శ్వేత, శేఖర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

మదనాపురం: మండల కేంద్రంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదగిరి, కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, నాయకులు రాజ్‌కుమార్, మండల నోడల్ అధికారి నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2023 క్యాలెండర్‌ను శనివారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ కోటేష్, జెడ్పీటీసీ శివరంజని, పుర చైర్‌పర్సన్ గాయత్రి, మాజీఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, తపస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, నాయకులు శశి, లింగన్న, ఒగ్గ ఉమాశంకర్, నారాయణ, కృష్ణయ్య, రమేష్, వాంతన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.